AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

3-10-2026 (Saturday)

MAIN EDITION

ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వం : కవిత



అక్షరటుడే, హైదరాబాద్ : ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమేనా ప్రజా పాలన అంటే అని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో సర్కార్ దవాఖానలో ప్రజల ప్రాణాలకు గ్యారంటీ లేదని మరోసారి నిరూపితం అయ్యిందన్నారు. ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదుగురు చిన్నారులు మృతి చెందిన ఘటన మరవక ముందే భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఎస్ఎన్సీయూ వార్డులో సీలింగ్ కూలిందన్నారు. ఆ సమయంలో వార్డులో పిల్లలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని తెలిపారు.

స్టార్ హీరోయిన్ బుగ్గలు గిల్లిన అభిమాని



అక్షరటుడే, సినిమాడెస్క్: కన్నడ చిత్రపరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రచితా రామ్ పుట్టినరోజు వేడుకల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. అక్టోబర్ 3న పుట్టినరోజు జరుపుకుంటున్న ఆమెను కలిసేందుకు అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఒక అభిమాని ముందుగా ఆమెతో సెల్ఫీ తీసుకున్నాడు. ఆ తర్వాత ఆమెకు షేక్‌హ్యాండ్ ఇచ్చి, అంతటితో ఆగకుండా ఒక్కసారిగా ఆమె రెండు బుగ్గలను పట్టుకుని గిల్లాడు.

భద్రాద్రి పవర్ స్టేషన్‌లో నిలిచిన మూడో యూనిట్



అక్షరటుడే, కొత్తగూడెం: భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో మూడో యూనిట్లో ఉత్పత్తి నిలిచిపోయింది. రోటర్ ఎక్సైటర్‌లో సాంకేతిక లోపంతో 24 రోజులుగా విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలిగింది. రోజుకు 270 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలుగుతోంది. రోటర్ ఎక్సైటర్ పరికరాలు రావడానికి మరో 15 రోజులు పట్టే అవకాశం ఉంది.

వారిని వదిలి పెట్టను.. ఎన్టీఆర్ ఆగ్రహం



అక్షరటుడే, సినిమాడెస్క్ : దేవర చిత్రంలోని చుట్టమల్లే సాంగ్ ఏఐ మార్ఫింగ్‌పై జూ.ఎన్టీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాటను మార్ఫింగ్ చేయటం అత్యంత అసహ్యకరమైన చర్య అన్నారు. కొందరు వ్యక్తులు అత్యంత దిగజారి ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. పాట మార్ఫింగ్ వీడియో వెనకున్న నీచులను వదిలిపెట్టనని స్పష్టం చేశారు.

సత్యాగ్రహ డిజిటల్ వేదికను ప్రారంభించిన రాహుల్ గాంధీ



అక్షరటుడే, ఢిల్లీ : దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అన్యాయాలు, ప్రజా సమస్యలపై పోరాడుతున్న ప్రజల గొంతుకలను ఏకం చేసేందుకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కొత్త అడుగు వేశారు. న్యూఢిల్లీలో 'సత్యాగ్రహ' పేరుతో ఒక సరికొత్త డిజిటల్ వేదికను ఆయన అధికారికంగా ప్రారంభించారు.

గోల్ఫ్‌లో పసిడి సాధించిన ప్రణవి



అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్: ఆసియా క్రీడల్లో శనివారం భారత్ సంచలన విజయాలు నమోదు చేసి రెండు స్వర్ణ పతకాలు గెలుచుకుంది. గోల్ఫ్‌లో తొలిసారి భారత్ పసిడి పతకం నెగ్గింది. గోల్ఫ్ మహిళల వ్యక్తిగత స్ట్రోక్ ప్లేలో ప్రణవి ఉర్స్ స్వర్ణం సాధించింది. అంతేగాకుండా అదితి అశోక్, దీక్షా డాగర్‌లతో కలిసి టీమ్ ఈవెంట్‌లో రజత పతకం సాధించింది. భారత క్రీడాకారిణి కుంకుమ్ మొహోద్ మహిళల రికర్వ్ వ్యక్తిగత ఆర్చరీ ఈవెంట్‌లో స్వర్ణాన్ని సాధించింది. ఈ విభాగంలో భారతదేశానికి మొట్టమొదటి ఛాంపియన్‌గా ఆమె నిలిచింది. అంతేగాకుండా 2028 ఒలింపిక్ క్రీడలకు అర్హత సాధించింది.



లోయలో పడిన బస్సు

- నలుగురి మృతి
- అనంతగిరి ఘాట్ రోడ్డులో ప్రమాదం
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం

> విషాదం చోటు చేసుకుంది. అనంతగిరి దగ్గర ఓ బస్సు అదుపు తప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో నలుగురు మహిళలు మృతిచెందగా.. ఏడుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు.
>
> - అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా కేసారం నుంచి వికారాబాద్ జిల్లా ధరూర్ మండలం చింతకుంటకు 54 మంది ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో బయలు దేరారు. వీరంతా అంత్యక్రియల కోసం వెళ్లినట్లు సమాచారం. అయితే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు అనంతగిరిలోని లోయలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో నలుగురు మరణించగా, ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. బస్సు రోడ్డు పక్కకు దూసుకెళ్లగానే, స్థానికులు సహాయం చేయడానికి పరుగెత్తుకొచ్చారు. సహాయక బృందాలు వచ్చేలోపే వారు బస్సు నుంచి ప్రయాణికులను బయటకు తీశారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ పరిశీలించారు. సహాయక చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

సీఎం సానుభూతి

అనంతగిరి ఘాట్ రోడ్డులో ఒక ప్రైవేటు బస్సు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అండగా ఉంటాం

ప్రమాద ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. మృతి చెందిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ ఘటన అత్యంత దురదృష్టకరం అన్నారు. ప్రమాదంపై ఆయన కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, సహాయక చర్యలు, క్షతగాత్రులకు అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

మెట్రోలో ప్రయాణించిన డిప్యూటీ సీఎం, మంత్రులు



అక్షరటుడే, హైదరాబాద్ : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్ శనివారం మెట్రో రైలులో ప్రయాణించారు. ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన మెట్రో, ఆర్టీసీ కామన్ మొబిలిటీ పాస్‌తో మెట్రోతో పాటు బస్సులో ప్రయాణించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కొత్త పాస్‌ను ప్రోత్సహించడానికి, హైదరాబాద్ ప్రజలకు ప్రజా రవాణాను సులభతరం చేయడానికి ఈ పర్యటన చేపట్టామన్నారు. ప్రయాణికులు ఇకపై బస్సు, మెట్రో ప్రయాణాలకు వేర్వేరు టిక్కెట్లు కొనాల్సిన అవసరం లేదన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రజా రవాణాను మరింత సౌకర్యవంతంగా మార్చే లక్ష్యంతో ఆర్టీసీ మెట్రో కామన్ పాస్ తీసుకొచ్చామని చెప్పారు.

పిల్లల రక్షణే లక్ష్యంగా సీఎం ప్రకటన



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : హైదరాబాద్ వేదికగా జరిగిన 'నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (NALSA)' దక్షిణ మండల ప్రాంతీయ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ డిజిటల్ యుగంలో పిల్లల సైబర్ భద్రత చాలా కీలకమని, వారి రక్షణ కోసం త్వరలోనే ఒక సమగ్ర 'చైల్డ్ ఆన్‌లైన్ సేఫ్టీ ఫ్రేమ్‌వర్క్'ను తీసుకురానున్నట్లు ఆయన ప్రకటించారు. రూపాయి లేని పేదవాడికి కూడా ఉచితంగా న్యాయం అందాలనే ఉద్దేశంతో న్యాయ సేవా సంస్థలు పనిచేయాలని సీఎం ఆకాంక్షించారు. పిల్లలు ఆన్‌లైన్‌లో ఎక్కువ సమయం గడుపుతున్నప్పటికీ, అక్కడ పొంచి ఉండే ప్రమాదాలను గుర్తించే అవగాహన వారికి ఉండదని, పెరిగిన డిజిటల్ నేరాల నేపథ్యంలో వారిని రక్షించే బాధ్యత అందరిపై ఉందని సీఎం పేర్కొన్నారు.

ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్య



అక్షరటుడే, వికారాబాద్ : వికారాబాద్ జిల్లాలో ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పూడురు మండలం మాటుగూడకు చెందిన రాజుకు భార్య మమత (30), పిల్లలు జనశ్రీ (8), సాకేత్ ఉన్నారు. కుటుంబ కలహాలతో శుక్రవారం ఉదయం మమత తన ఇద్దరు పిల్లలను తీసుకొని ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తన పుట్టిల్లు నారాయణపూర్ గ్రామానికి వెళ్తున్నానని భర్తతో చెప్పింది. అయితే ఆమె మార్గమధ్యలో సోమన్‌గర్తి గ్రామ సమీపంలో పిల్లలతో సహా బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మా కంపెనీలో పేలిన రియాక్టర్.. ఐదుగురి మృతి



అక్షరటుడే, ఏపీ : తిరుపతి జిల్లాలోని శ్రీ సిటీ సమీపంలో ఉన్న టీఐఎల్ హెల్త్ కేర్ ఫ్యాక్టరీలో శనివారం ఉదయం పేలుడు చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఐదుగురు కార్మికులు మృతి చెందారు. సత్యవేడు మండలం శ్రీ సిటీలోని ఒక ప్రైవేట్ ఫార్మా కంపెనీలో ఈరోజు ఉదయం ఒక్కసారిగా బాయిలర్ పేలింది. ఫ్యాక్టరీలో ఉదయం 8 గంటల ప్రాంతంలో ఈ పేలుడు సంభవించింది. రాత్రి విధుల్లో ఉన్న పలువురు కార్మికులు ప్రమాదంలో చిక్కుకుపోయారు. వారిలో ఐదుగురు మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

రైల్వే శాఖ కీలక నిర్ణయం



అక్షరటుడే, సికింద్రాబాద్ : దసరా, దీపావళి పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులకు అదిరిపోయే శుభవార్త చెప్పింది. సికింద్రాబాద్, నాంపల్లి స్టేషన్లపై రద్దీని తగ్గించేందుకు, ఐటీ కారిడార్ ఉద్యోగులకు ప్రయాణం సులభం చేసేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాన రైల్వే స్టేషన్లలో రద్దీ విపరీతంగా పెరగడంతో, ఐటీ కారిడార్ ప్రాంతంలో నివసించే ఉద్యోగులు, ప్రయాణికులకు రాకపోకలు సులువుగా ఉండాలని హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో 10 కీలకమైన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తాత్కాలిక నిలుపుదల (హాల్ట్) కల్పిస్తున్నట్లు రైల్వే శాఖ వెల్లడించింది. ఈ సౌకర్యం నవంబర్ 1, 2026 నుండి జనవరి 31, 2027 వరకు అందుబాటులో ఉంటుందని దక్షిణ మధ్య రైల్వే స్పష్టం చేసింది.

పాక్‌పై ఘన విజయం.. పసిడి గెలుచుకున్న భారత్



అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ : ఆసియా క్రీడల్లో భాగంగా చిరకాల ప్రత్యర్థి పాక్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత క్రికెట్ జట్టు ఘన విజయం సాధించింది. ప్రత్యర్థిని చిత్తు చేసి పసిడి పతకం గెలుచుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ భారీ స్కోర్ చేసింది. అభిషేక్ శర్మ 61, తిలక్ వర్మ 51, శివమ్ దూబే 27, శ్రేయాస్ అయ్యర్ 21, ఇషాన్ కిషన్ 20 పరుగులు చేశారు. దీంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పాక్ ఆదిలోనే వికెట్లు కోల్పోయింది.పాక్ బ్యాటర్ హసన్ నవాజ్ ఒంటరి పోరాటం చేశాడు. 51 బంతుల్లో 96 పరుగులు చేశాడు. మిగతా బ్యాట్స్‌మెన్ విఫలం కావడంతో పాక్ లక్ష్యం ఛేదించలేకపోయింది.

సీఎం రేవంత్‌పై హరీష్ రావు ఫైర్



అక్షరటుడే, సిద్దిపేట: రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ కోతలు, సాగునీటి ఎద్దడిపై మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పాత రోజులు తెస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి, నిజంగానే ఆనాటి అంధకారపు కరెంట్ కోతల రోజులను వెనక్కి తీసుకువచ్చారని ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఎద్దేవా చేశారు. 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వడం దేవుడెరుగు, కనీసం 6 గంటలు కూడా సక్రమంగా కరెంట్ ఇవ్వలేక ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందని విమర్శించారు. "పరిపాలన అంటే మైకుల ముందు నిలబడి ఉపన్యాసాలు దంచడం కాదు.. సంక్షోభంలో ఉన్న అన్నదాతకు అండగా నిలవడం" అని సీఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు సూచించారు.